క్లుప్తంగా

ఎన్ఎస్ఎస్ శిబిరం

వైవీయూ: వైవీయూ సమీప గ్రామమైన మల్లాయపల్లెలో గురువారం ఎన్ఎస్ఎస్ శిబి రం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్–8 ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎస్. సుమిత్ర మాట్లాడుతూ వైవీయూకు చెందిన 54 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో సేవాకార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో ప్రముఖ బ్యాంకులలో ఉద్యోగాల కోసం శనివారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ, పీజీ కలిగి 18–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 12–25 వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు తీసుకుని ఈ జాబ్‌మేళాలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న పాస్టర్ దాసరి సుధాకర్

కడప కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్ కోరారు. గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని మాసాపేట కొత్త కొట్టాలు ఏలీము ప్రార్థన మందిరంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాస్టర్లందరికీ గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా చర్చిల నిర్మాణం కోసం 5 సెంట్లు స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ కె ఫిలిప్, జైభీమ్ మాల సేన అధ్యక్షుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ మల్లెకొండు సంపత్ కుమార్ వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఘన నివాళి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పోరాట వీరుడు, అపర మేధావి కామ్రేడ్ కారల్ మార్క్స్ అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కారల్ మార్క్స్ వర్ధంతిని కాగితాలపెంటలోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్సీపీ కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధరామయ్య, ఆర్సీపీ నగర కార్యదర్శి మక్బూల్ బాషా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, కాసిం, రమేష్, రవి, రైతు నాయకులు ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

భూమి పూజ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఎర్రముక్కపల్లె శాంతి సాగర్ హోటల్ పక్కన జనరల్ ఫండ్ రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డుకు 21వ డివిజన్ ఇన్‌చార్జి ఎం. సుబ్బరాయుడు, స్థానిక ప్రజలతో కలిసి భూమిపూజ చేశారు. రోడ్డు మంజూరుకు సహకరించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథ్ రెడ్డి, కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు డివిజన్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఢిల్లీ రైతు ఉద్యమంపై నరేంద్రమోదీ ప్రభుత్వం నిరంకుశత్వం, రైతుల పట్ల కర్కశంగా వ్యవహరించిన విధానాన్ని నిరసిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రైతు కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరిరెడ్డిలు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా గతంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ నిరసనలో రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, రైతు, కార్మిక సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమం

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో సంక్షేమ పథకాలు లబ్ధిదారుని ఇంటికే చేరుతున్నాయని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎల్లారెడ్డిపల్లెలో గ్రామ సచివాలయం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఆయన ఇండస్ట్రియల్ స్టేట్ అడ్వైజర్ రాజోలి వీరారెడ్డితో కలసి ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

గత పాలకులు అసూయ చెందేలా అభివృద్ధి

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాష

కడప కార్పొరేషన్: గత ప్రభుత్వాలు, గత నాయకులు, అసూయ చెందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాష అన్నారు. గురువారం స్థానిక పాలంపల్లె, రూక వారి పల్లె లో 50వ డివిజన్ ఇన్‌చార్జి కె. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్డు, 3 డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అంజాద్ బాష మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో నగరాభివృద్ధికి రూ.2400 కోట్లు కేటాయించారని, ఈ నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా చేయడం జరుగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం జిల్లాను, కడప నగరాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. సీఎం జగన్ జిల్లా వాసి కావడం మన అదృష్టమన్నారు. కడప నగరంలో అన్ని కూడళ్లను అభివృద్ధి చేయడం జరిగిందని, రోడ్డు విస్తరణలు కూడా పూర్తయ్యాయన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిని చేసి చూపిస్తున్న వైఎస్ఆర్‌సీపీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, తిరుమల దేవస్థానం బోర్డు మెంబర్ మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, షఫీ, తోటక్రిష్ణ, పాలెంపల్లె శేఖర్, శ్రీను, రమేష్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పొందిన లబ్ధిదారులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం స్థానిక ఉపముఖ్యమంత్రి నివాస కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద కడప నగరానికి చెందిన 12 మందికి చెక్కులను పంపిణీ చేశారు. కె.అబ్దుల్, వై. వెంకట సాయి, ఎం. నరసింహులు, రావి నరసింహారావు, వి.నాగరత్నమ్మ, ఎస్. జైబున్నిసా, బి. విజయ్ భాస్కర్, షేక్ నజీర్ బాషా, రవి శంకర్, ఏ. శేషయ్య, వి.హేమ చంద్రా రెడ్డి, ఫర్హాత్ అంజుమ్ లకు రూ.21.26 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజాద్ బాష మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో కవర్ కాని రోగాలకు, అలాంటి వైద్య చికిత్సలకు కూడా సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, సుబ్బారాయుడు, మధువర్ధన్ రెడ్డి, కె. రాజశేఖర్ రెడ్డి, బండి ప్రసాద్, బాలక్రిష్ణారెడ్డి, షంషీర్, బసవ రాజు, ఎన్. సుబ్బా రెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రైతు సంఘం నేత రామాంజనేయులు

కడప సెవెన్‌రోడ్స్ : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి శాస్త్రీయ పరిష్కారం చూపాలని అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రామాంజనేయులు కోరారు. గురువారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రధానమంత్రికి పంపాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ సిఫార్సులను అనుసరించి అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. కౌలు రైతులతో సహా మిగతా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, ఈ మేరకు తాజా మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు. విద్యుత్ బిల్లు 2020ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు సామాజిక భద్రత పెన్షన్ల పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ నాయకుడు వీరయ్యలు పాల్గొన్నారు.

దైవం సూచించిన మార్గం రంజాన్ ఉపవాసం

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప కల్చరల్ : రంజాన్ ఉపవాసాలు ఆరోగ్యం కోసమే కాకుండా దైవం సూచించిన ఆధ్యాత్మికమార్గం కూడా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాష అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక వైవీ స్ట్రీట్‌లోని జుమ్మ మసీదు లో రంజాన్ ఉపవాస 3వ రోజున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష హాజరై ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో విశ్వ శాంతికై అల్లాహ్ ను ప్రార్థిస్తామన్నారు. ఈ మాసంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం పుణ్యదాయకమని తెలిపారు. కులమతాలకు అతీతంగా కడప నగరంలో మత సామరస్యానికి మారుపేరుగా ఇఫ్తార్‌లు నిర్వహించడం విశేషమన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి మగ్రీబ్ నమాజు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మత గురువులు, ముస్లిం ప్రముఖులు, మైనారిటీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రార్థనలలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ముస్లింలు

అభివృద్ధి పనుల పరిశీలన

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ గురువారం నగరంలో మార్నింగ్ విజిట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన పుట్లంపల్లి, ఉక్కాయపల్లి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, వినాయక నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత కమిషనర్ పుట్లంపల్లిలోని వర్మీ కంపోస్టు పురోగతిపై తనిఖీ చేశారు. ఇక్కడ మెష్‌ను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. వంతెన నిర్వహణ కోసం ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం శానిటేషన్ విభాగ అధికారులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఉక్కాయపల్లిలో కొనసాగుతున్న పనులపై తనిఖీ చేసిన కమిషనర్ జీటీఎస్, ఆర్ఆర్ఆర్ సెంటర్లను సక్రమంగా నిర్వహించా లని సంబంధిత అధికారులను ఆదేశించారు. పచ్చదనాన్ని పెంపొందించాలని హార్టికల్చర్ విభాగ అధికారులను ఆదేశించారు. వర్మీ కంపోస్టులో వర్కర్ల హాజరు పట్టికలను పరిశీలించారు. నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను నాణ్యతగా త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

సంస్కారం నేర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప ఎర్రముక్కపల్లె బాలవికాస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, చిన్మయమిషన్ స్వామీజీ తురియానంద మహారాజ్‌స్వామీ, వైవీయూ ప్రొఫెసర్ రామ్ ప్రసాద్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్య పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి



హాజరైన విద్యార్థులు (ఇన్‌సెట్) సమావేశంలో మాట్లాడుతున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ శ్రీదేవి

కడప ఎడ్యుకేషన్: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం కడప నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ చట్టాలు, మెయింటెనెన్స్ చట్టాలు, గృహహింస, పౌర మరియు క్రిమినల్ చట్టాలు, వరకట్న మరణం, యాసిడ్ దాడి, కిడ్నాప్, అపహరణ, పోక్సో చట్టం, విద్యాహక్కు చట్టం గురించి విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. విద్యార్థినిలకు సమస్యలుంటే 15100, 1098, 181, 14567 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని వివరించారు. విద్యార్థినిలు బాగా చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని అక్షాంక్షించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ

వైవీయూ : ఆలిండియా సైనిక్‌స్కూల్ ప్రవేశపరీక్షల్లో కడప నగరానికి చెందిన బాలవికాస్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ర్యాంకుల్లో కడప బాలవికాస్ పాఠశాల విద్యార్థిని బి. ఆరాధ్యకృష్ణ 275/300 మార్కులతో ఆలిండియా 351వ ర్యాంకుతో టాపర్‌గా నిలిచింది. సి.వి. నిరుపమ్‌రెడ్డి 396వ ర్యాంకు, పి. కల్యాణ్‌రామ్ 992వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు డి. అభినవ్‌రెడ్డి 261 మార్కులు, ఎస్ఎండీ రయాన్ 261 మార్కులు, ఎం .లక్ష్మీమాతేష్ 260, బి. హిమజ 258, ఎం.నరసింహదినేష్ 258, వై.శ్రావణ్‌సిద్ధాంత్‌రెడ్డి 257 మార్కులతో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్య తెలిపారు. పరీక్షకు 78 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 75 మంది విద్యార్థులు ఈకౌన్సిలింగ్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను అభినందన కార్యక్రమం నిర్వహించారు.



సైనిక్‌స్కూల్ ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో బాలవికాస్ హైస్కూల్ యాజమాన్యం

బసిరెడ్డి వికాస్ విద్యార్థుల ప్రతిభ..

కడప నగరం ఊటుకూరులోని దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షలో 16 మంది అర్హత సాధించినట్లు సంస్థ డైరెక్టర్ దిన్నెపాటి బసిరెడ్డి తెలిపారు. బి.గురువర్ధన్‌రెడ్డి 222/300 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరితో పటు పలువురు విద్యార్థులు ఈ కౌన్సెలింగ్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు.

సుస్థిర పాలన కోసం మేమంతా సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చెన్నూరు : ఇచ్చిన హామీ మేరకు నవరత్నాల పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. గురువారం చెన్నూరులో సిద్ధం సభను వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సభలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబులు పాల్గొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్, పాత రోడ్డు మీదగా పార్కువీధి నుంచి, సభా ప్రాంగణం కొత్త రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ అన్ని కలిసి పోటీకి సిద్ధమయ్యాయి అంటే మన ముఖ్యమంత్రికి ప్రజల బలం ఎంత ఉందో వారికి అర్థమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే పోచమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నూరు మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశామన్నారు. కొంతమంది ఈ అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఇంత పెద్ద ఎత్తున పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే కొన్ని పచ్చ పత్రికలు వక్రీకరించి రాస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో మూడవసారి పార్టీ జెండా ఎగరవేయడం తథ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో కమలాపురం నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డుమెంబర్ మాసీమబాబు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ అధ్యక్షుడు పులి సునీల్‌కుమార్, రాష్ట్ర హార్టికల్చర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, జీఎన్ భాస్కర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్‌ఆర్, సీనియర్ నాయకులు గణేష్‌రెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మీ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రఓబులరెడ్డి, నాయకురాలు భాగ్యమ్మ, జెసీఎస్ మండల కన్వీనర్ నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ర్యాలీగా వస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే,ఆర్టీసీ చైర్మన్



సమావేశానికి హాజరైన వైఎస్ఆర్‌సీపీ నాయకులు, ప్రజలు

యువత ఓటుహక్కు వినియోగించుకోవాలి

కడప స్పోర్ట్స్: యువత ఓటును విధిగా నమోదు చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో ఖచ్చితంగా వినియోగించుకోవాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ సూచించారు. గురువారం కడప నగరంలోని సాయికృప నర్సింగ్ కళాశాలలో స్టెప్, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్' నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ మాట్లాడుతూ దేశజనాభాలో సింహభాగం యువత ఉన్నప్పటికీ కేవలం 2.8 శాతం మంది మాత్రమే పార్లమెంట్‌లో ఉన్నారన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రభుత్వాలను ఏర్పాటు చేసి చట్టాలను రూపొందించాలన్నారు. వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ యువతే దేశానికి వెన్నెముక అన్నారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వికసిత్ భారత్, చంద్రయాన్, భారతరత్న అవార్డులు, భారతదేశం సాధించిన ప్రగతి తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వివిధ కాంపిటీషన్‌లలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యానాగభూషణ్ పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికలు అందజేసిన అధికారులు